క్లుప్తంగా

నగరంలో బీసీ ప్రజా ప్రతినిధుల సమీక్ష



దత్తాత్రేయ, శ్రీనివాస్‌గౌడ్‌లను సన్మానించిన నేతలు

కడ్తాల్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల అఖిల పక్ష సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ పాల్గొన్నారు. బీసీల 42శాతం రిజర్వేషన్ చర్చలో నేతల సంభాషన విన్నారు. అనంతరం మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ నేత హన్మంత్‌రావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌లను సన్మానించారు.

మారథాన్‌లో కానిస్టేబుల్ ప్రతిభ



చందన్‌సింగ్‌కు బహుమతి అందజేస్తున్న నిర్వాహకుడు

కడ్తాల్: మండల పరిధి అన్మాస్‌పల్లిలో మహేశ్వర మహాపిరమిడ్ వద్ద ఆదివారం నిర్వహించిన తెలంగాణ అల్ట్రా మారథాన్ 5 కిలో మీటర్ల పరుగు పందెంలో కానిస్టేబుల్ చందన్‌సింగ్ మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్, ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్ కానిస్టేబుల్‌ను అభినందించారు.

వాటర్ బాటిల్స్ పంపిణీ



వాటర్‌బాటిల్స్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నగరంలోని ఏవీ కళాశాల ఆవరణలో, లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత ఆరోగ్య శిబిరంలో క్లబ్ ఆమనగల్లు సభ్యులు వాటర్‌బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు నేత్ర, డెంటల్, మానసిక, ఆర్థోపెడిక్, హియరింగ్ తదితర వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పీఆర్‌ఓ పాషా, జోన్ చైర్మన్ లింగయ్య, జిల్లా చైర్మన్ కండె ఓంకారం, జూలూరు రమేశ్, మిట్టపల్లి అంజయ్య, సునంద, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌చారి

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని బీఆర్‌ఎస్ నాయకుడు మారోజ్ శ్రీనివాస్‌చారి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీలుగా పోటీ చేసే వారిని అధిష్ఠానం ఎంపిక చేయనుందని పేర్కొన్నారు. అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇందుకోసం బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు.

కేఎల్లార్‌ను కలిసిన నాయకులు

కందుకూరు: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిలను కందుకూరు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఆదివారం తుక్కుగూడలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ సబావత్ కృష్ణ నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్కజంగారెడ్డి, రాంచంద్రారెడ్డి, చిర్రె సాయిలు, రాణా ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, రాకేష్, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

బైపాస్ కల.. సాకార వేళ

తీరనున్న రహదారి కష్టాలు
- కొనసాగుతున్న బీటీ పనులు
- తగ్గనున్న దూరభారం
- అభివృద్ధి చెందనున్న సమీప ప్రాంతాలు



కొనసాగుతున్న బీటీరోడ్డు పనులు

ఇబ్రహీంపట్నం: పట్నం బైపాస్ కల నెరవేరనుంది. శరవేగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులతో త్వరలో వినియోగంలోకి రానుంది. రాష్ట్ర రాజధాని ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇబ్రహీంపట్నం టౌన్‌కు దగ్గరగా నాగార్జునసాగర్ నుంచి వేసిన కృష్ణా జలాల పైపులైన్ మట్టి రోడ్డు(బైపాస్ రోడ్డు) అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రవాణా మార్గం మెరుగుపరిచి, ప్రయాణికుల ఇక్కట్లను తొలగించేందుకు బీటీ నిర్మాణ పనులు వడివడిగా జరుగుతున్నప్పటికీ.. ఏళ్లుగా ఎదురు చూసిన బైపాస్ కల ఎప్పుడు నెరవేరుతుందా అని పరిసర ప్రాంత ప్రజలు ఆతృతగా ఉన్నారు.

కాలనీల అభివృద్ధి

హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ శాఖ ప్రత్యేక రోడ్డును వేసి, మూడు పైపులైన్ల ద్వారా కృష్ణా జలాలను నగరానికి తరలిస్తున్నారు. ఈ రోడ్డు పట్నం నుంచి కోహెడ క్రాస్ రోడ్డు వద్ద సాగర్ హైవేకు కలుస్తుండటంతో బైపాస్ రోడ్డుగా పేరు గాంచింది. సుమారు 20 ఏళ్ల క్రితం ఏడు కి.మి. మేర కంకరతో కూడిన మట్టి రోడ్డును వేశారు. పట్నం టౌన్‌లోకి రాకుండా నాగన్‌పల్లి, ఖానాపూర్, పొల్కంపల్లి, రాయపోల్, దండుమైలారం, ముకునూర్, మంచాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వారికి ఈ మార్గం ఎంతో ఉపయోగకరం. అంతే కాకుండా ఈ రోడ్డుకు ఇరువైపులా వెలుస్తున్న కాలనీల అభివృద్ధికి దోహదపడనుంది. ఇదే అంశంపై గతంలో 'సాక్షి' దినపత్రికలో వార్తా కథనాలు వెలువడటంతో.. అధికార యంత్రాంగం బీటీ పనులకు శ్రీకారం చుట్టింది.

త్వరగా పూర్తయ్యేనా?

బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఈ ఏడాది జూన్ 16న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శిలాఫలకం వేశారు. నగరం నుంచి మెట్రోపాలిటిన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) ఇందుకు నిధులు కేటాయిస్తోంది. నాగార్జునసాగర్ హైవే నుంచి ఇబ్రహీంపట్నం, నాగన్‌పల్లి రోడ్డు వరకు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. తొలివిడతగా సాగర్ హైవే నుంచి భారత్ గార్డెన్ వరకు మట్టిరోడ్డును చదును చేశారు. అవసరమున్న చోట కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే బీటీ పనులు శరవేగంగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అపరిశుభ్రతకు చెక్



బైపాస్ వెంట చెత్తాచెదారం(ఫైల్)

ఇబ్రహీంపట్నంలోని ఫంక్షన్‌హాళ్లు, మాంసాహార దుకాణాలు, హోటళ్ల నుంచి వెలువడిన వ్యర్థాలను ఆయా నిర్వాహకులు.. పట్టణానికి దూరంగా ఉన్న ఈ బైపాస్ దారికి ఇరువైపులా పారబోస్తుంటారు. దీంతో ఈ ప్రాంతం పందులకు ఆవాసంగా మారటమే కాకుండా.. ఈ మార్గంలో పయనించేవారికి, సమీపంలోని కాలనీల ప్రజలకు తీవ్రమైన దుర్వాసన వస్తోంది. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న రోడ్డు అభివృద్ధితో ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది.

గత పాలకులు విఫలం



ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. ఇబ్రహీంపట్నం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తోంది. 20 ఏళ్లుగా బైపాస్‌ను బీటీరోడ్డుగా మార్చడంలో గత పాలకులు విఫలమయ్యారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో హెచ్‌ఎండీఏ నిధులతో బీటీ పనులు మొదలయ్యాయి.

– శ్రీనివాసాచారి, కాంగ్రెస్ పార్టీ, పట్నం టౌన్ సెక్రటరీ

ప్రజలకు ఎంతో మేలు



బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇక్కడి ప్రజలకు, వాహనదారులకు ఎంతో మేలు చేకూరనుంది. పట్టణంలోకి రాకుండా వాహనాలు వెళ్లేందుకు వీలుంటుంది. దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు, దూరభారం తగ్గనుంది. రోడ్డు అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, సోషల్ మీడియా ఇన్‌చార్జి, పట్నం

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ముసుగు

స్థానికుల నిరసన.. ఎస్‌ఐ జోక్యంతో తొలగింపు



జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న యువకులు

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో మొండిగౌరెల్లి గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది ముసుగు వేశారు. ఇందుకు నిరసనగా.. ఆదివారం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మధు.. నిరసనకారులతో మాట్లాడి, శాంతింపచేశారు. విగ్రహం ముసుగును తొలగింప చేయించారు. ఈ సందర్భంగా విగ్రహానికి ముసుగు వేయించిన గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ అలైన్‌మెంట్ మార్చండి



సమావేశంలో అభివాదం చేస్తున్న రైతులు, నాయకులు

కడ్తాల్: పంట పొలాల మీదుగా తీస్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్‌లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. లైన్ మార్చాలని సెప్టెంబర్‌లో 23 రోజుల పాటు రిలే నిరాహార దీక్ష చేపట్టామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. అధికారుల సూచనల మేరకు దీక్షను విరమించామని తెలిపారు. అలైన్‌మెంట్‌తో పేద, చిన్న సన్న కారు రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని, కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల రైతులను దృష్టిలో ఉంచుకొని లైన్‌ను మార్చాలని కోరారు. కార్యక్రమంలో రైతు ఉద్యమ నాయకులు కడారి రామకృష్ణ, వెంకటేశ్, పెంటారెడ్డి, శ్రీరాములు, శేఖర్‌రెడ్డి రాములు యాదవ్, రాజేందర్‌యాదవ్, పర్వత్‌కుమార్, పాండునాయక్, బీక్యానాయక్, కడారి రమేశ్, అభిలాష్‌రెడ్డి, వెంకటయ్య, గోరటి కృష్ణ, రవి, కృష్ణ, వెంకటేశ్ నరేశ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

న్యూమధురాపురి కాలనీ అధ్యక్షుడి నియామకం



నూతన కమిటీని సన్మానిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 4వ డివిజన్ న్యూ మధురాపురి కాలనీ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంక్షేమ సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెరుమళ్ల నవీన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా రేవంత్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా బల్వంత్ ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరి సహకారంతో కాలనీలో పేరుకుపోయిన సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. నియామకానికి పూర్తి సహకారం అందించిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు తాడూరి వెంకటరమణ, కాలనీవాసులు మహేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాగార్జున, ప్రసాద్, బసవరాజు, కిరణ్, మహిళలు ఉన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గోవిందమ్మ, డైరెక్టర్లు

శంకర్‌పల్లి: మార్కెట్ కమిటీ కార్యవర్గంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, వాటిని నిరూపిస్తే రాజీనామాకైనా సిద్ధమని శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ స్పష్టం చేశారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, డైరెక్టర్లతో కలిసి ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఇటీవల ఎంతో రాజకీయ అనుభవం ఉన్న పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు తాము స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు రూ.30 లక్షలు, డైరెక్టర్లు రూ.20 లక్షలు చెల్లించి పదవులు పొందామని ఆరోపించారన్నారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వారి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం మర్యాదగా వ్యవహరిస్తున్నామని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా గత 12ఏళ్ల కాలంలో ఎమ్మెల్యేగా యాదయ్య ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి, నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ప్రశాంత్, సర్తాజ్, శ్రీహరి, సంతోష్, శేఖర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముట్టి కేజీ తీయాలని తీర్మానిస్తాం

ఉల్లి, కూరగాయలపై ముట్టి 4 కేజీల నుంచి 5 కేజీలు తీస్తుండడంతో ఇప్పటికే పలుమార్లు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే తాజాగా మార్కెట్ కమిటీ ఉల్లిపై క్వింటాల్‌కి ముట్టి కేవలం కిలో, కూరగాయలపై అరకిలో మాత్రమే తీసేలా నిర్ణయం తీసుకున్నారు. త్వరలో దీనిపై తీర్మానం చేసి, ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తామని చైర్‌పర్సన్ గోవిందమ్మ స్పష్టం చేశారు.

తాగునీటి కష్టాలు తీర్చిన ఘనత కేసీఆర్‌దే

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



తాగునీటి పైపులైన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని హయత్ కొంటి కాలనీలో వేసిన నూతన తాగునీటి పైపులైన్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఏర్పాటు తర్వాత మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చి గ్రామాలు, పట్టణాల్లో ట్యాంకులు నిర్మించి ఇంటింటికీ మంచినీరు అందించిన ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. కాలనీతో పాటు పక్కన ఉన్న షరీఫ్‌నగర్, డ్రీమ్ సిటీ కాలనీల్లో కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని జలమండలి అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు మహ్మద్ అక్బిల్, రవూఫ్, మహ్మద్ బాసిత్, అబ్దుల్ బాయ్, బేకుల భాస్కర్‌రెడ్డి, మహిళలు ఉన్నారు.

అపరిచితులతో అప్రమత్తం

సీఐ వేణుగోపాల్ రావు



మాడ్గుల: సైబర్ నేరగాళ్లు, అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సీఐ వేణుగోపాల్ రావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. లక్కీ డ్రా, పండగ ఆఫర్స్, ఆధార్ అప్డేట్ కేవైసీ అంటూ.. మొబైల్ ఫోన్లకు వచ్చే మోసపూరిత లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. వీటిని ఓపెన్ చేస్తే.. బ్యాంకు ఖాతాలోని డబ్బులను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టే అవకాశం ఉందని తెలిపారు. ఉద్యోగాలు, లోన్ ఇప్పిస్తామని వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దన్నారు. కొత్తవారితో బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఆధార్, పాన్‌కార్డు వివరాలను పంచుకోవద్దని చెప్పారు. సైబర్ మోసానికి గురైన వారు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

నేడు ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

మహేశ్వరం: ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ దేశ వ్యాప్తంగా ఓట్ల చోరికి పాల్పడిందని, దానికి వ్యతిరేకంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని, మండలంలోని పార్టీ నాయకులు, గ్రామ శాఖ, వివిధ అనుబంధ శాఖల అధ్యక్షులతో పాటు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా గ్యార్మీ పండుగ



మహేశ్వరం: జామ మసీదులో ప్రత్యేక పూజలు చేస్తున్న ముస్లింలు



తుక్కుగూడ: మంఖాల్‌లో..

మహేశ్వరం: మండల కేంద్రంలోని జామ మసీద్, దర్గాలోని హజరత్ సయ్యదినా మహబూబ్ సుభానీ రహమతుల్లా అలై చిల్లా ముబారక్ గ్యార్మీ పండుగను ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఘనంగా నిర్వహించారు. ప్రజలందరినీ ఆయు ఆరోగ్యాలతో చల్లగా చూడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల, మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ గ్యార్మీ పండుగలో పాల్గొని మత సామరస్యాన్ని పెంపొందే విధంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం మజీద్ వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జామ మసీద్ ఇమామ్, సయ్యద్ అహ్మద్ అలీ, ముస్లిం మతపెద్దలు ఎంఏ.సమీర్, సయ్యద్ ఆరీఫ్ అలీ, మహ్మద్ అక్బర్ పాషా, మహ్మద్ ముస్తాక్, మహ్మద్ మోసిన్, షేక్ హాజీ బాబ, మహ్మద్ సర్దార్ పాల్గొన్నారు.

మంఖాల్‌లో..

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్‌లో ముస్లింలు ఆదివారం గ్యార్మీమి షరిఫ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికరూ ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. చాంద్ సాహెబ్, సయ్యద్ సాబేర్ అలీ, ఇమామ్, అబ్దుల్, జావిద్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

- ఆందోళనలో స్థానికులు
- కూల్చివేసి, నూతనంగా నిర్మించాలని వినతి



నీటి ట్యాంకర్ దుస్థితి

మొయినాబాద్: సుమారు ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలి పడుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం లో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ పిల్లర్లు, బీమ్‌లు పెచ్చులూడి పోయి ఇనుప రాడ్లు తేలాయి. అయినా ఇప్పటికీ దానిలో నీటిని నింపుతుండడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంకులో నుంచి నీళ్లు లీకవుతున్నాయి. ఇక్క సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వాటర్‌ట్యాంకుకు మరమ్మతులు చేయించాలని.. లేదంటే పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించాలని అనేక సార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించామని.. ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంకును తొలగించాలని కోరుతున్నారు.

శంకుస్థాపనతో సరి!

- రూ.45 కోట్లతో రోడ్డు పనులకు శ్రీకారం
- మూడు నెలలైనా.. ఖరారు కాని ముహూర్తం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కోనాపూర్- మాడ్గుల ప్రజలు



కోనాపూర్- మాడ్గుల రోడ్డు

ఆమనగల్లు: ఎంతో కాలంగా ఎదురు చూసిన రహదారి విస్తరణ పనులకు అట్టహాసంగా మంత్రులు శంకుస్థాపన చేశారు. ఇందుకు భారీ నిధులు కేటాయించారు. టెండరు ప్రక్రియ ప్రారంభించారు. ఇది జరిగి మూడు నెలలు అయినా.. రోడ్డు అభివృద్ధి పనులపై కదలిక రాలేదు.

విస్తరణకు నోచుకోని రోడ్డు

సుమారు రెండు దశాబ్దాల క్రితం ఆమనగల్లు మండలం కోనాపూర్- మాడ్గుల పంచాయతీరాజ్ రోడ్డును ఆర్‌అండ్‌బీ పరిధికి మార్చి, సింగిల్ బీటీ రోడ్డు నిర్మించారు. కోనాపూర్‌గేటు నుంచి కోనాపూర్, ఆకుతోటపల్లి, మాడ్గుల మండలం దొడ్లపహాడ్ మీదుగా మాడ్గుల మండల కేంద్రానికి 21 కిలో మీటర్ల రోడ్డును వేశారు. అంతా బాగానే ఉన్నా.. నాటి నుంచి నేటి వరకు ఆ రోడ్డుకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారింది. కోనాపూర్ నుంచి మాడ్గుల రోడ్డు మీదుగా నగరం నుంచి ఆకుతోటపల్లి, దొడ్లపహాడ్, గోరారం గ్రామాలకు వరకు అనుకూలంగా ఉంది. కాని ఇరుకైన మార్గం, నిత్యం వాహనాల రద్దీతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రోడ్డును విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి చొరవ

కోనాపూర్- మాడ్గుల మార్గాన్ని విస్తరించాలన్న ప్రజల కోరిక మేరకు.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇదే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. డబుల్‌రోడ్డు నిర్మాణానికి గత ఏడాది అక్టోబర్‌లో రూ.45 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ ఏడాది జులై 11న రోడ్డు నిర్మాణ పనులకు మాడ్గుల మండల కేంద్రంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావు, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్ సైతం చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇది జరిగి మూడు నెలలు కావస్తున్నా.. నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారు కాలేదు. దీంతో రహదారి కష్టాలు తీరుతాయని భావించిన ప్రజలు.. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.